

# 5

# చైనా నాగరకత


ప్రాచీన ప్రపంచ నాగరకతలలో చీనాదేశానికి ప్రముఖస్థానం ఉంది. చీనాకు ఈ స్థానం లభించడానికి ముఖ్యకారణాలలో ఒకటి ఆ దేశ భూగోళము, నైసర్గిక స్వరూపము. చీనా 1036000,000 హెక్టారులు విస్తీర్ణంగల విశాల భూభాగము. దీనికి తూర్పున పసిఫిక్ మహా సముద్రము, పశ్చిమ, వాయవ్య, నైఋతి దిశలలో పర్వత పంక్తులు, ఎడారులు, పీఠభూములు ఉండడం మూలాన చీనా మధ్య భాగం విదేశ దండయాత్రలకు గురికాలేదు. దేశ వైశాల్యంవల్ల చీనాలో వివిధ శీతోష్ణస్థితులు ఏర్పడినాయి. చీనా దేశాన్ని భౌగోళికంగా మూడు భాగాలు చేయవచ్చు. ఇవి హ్వాంగ్ హో (Hoang-ho) నదీ లోయ, యాంగ్ జీ (Yang-tze) నదీలోయ, దక్షిణ చైనా. మొదటి ప్రాంతంలో హ్వాంగ్ హోనది ప్రవహించే భూమిని సారవంతము కావించినాయి. ఈ నది వరదలవల్ల చీనా ప్రజలకు ధనప్రాణ నష్టము అధికంగా కలిగినందున ఈనదికి 'చైనాదుఃఖము' (China's-Sorrow) అనేపేరు వచ్చింది. ఈ ప్రాంతానికి దక్షిణాన ప్రపంచంలో ప్రసిద్ధనదులలో ఒకటైన యాంగ్ జీ నది పారుతున్నది. దీనిపొడవు 5120 కి. మీ. ఇది నౌకాయానానికి అనువుగాఉంది. యాంగ్ జీ లోయను సారవంతం చేస్తున్నది. దక్షిణ చైనా పర్వతమయమైన ప్రదేశము. ఇక్కడ ఖనిజసంపద అధికంగా ఉన్నది. ప్రాచీనా చైనా నాగరకత హ్వాంగ్ హో, దాని ఉపనదిఐన వే (wei) నదీ లోయలో విలసిల్లినది. ఈ నదులవల్ల భూమి సారవంతమై, వ్యవసాయానికి అనువుగా ఉండడం, రాకపోకల సౌకర్యాలు నదీమార్గాల వల్ల ఏర్పడడం ఇక్కడ నాగరకత వృద్ధిపొందడానికి ముఖ్యకారణాలు. (దేశపటము 6).




చరిత్ర పూర్వ యుగం చైనా



'చౌ' వంశ కాలంలో చైనా



చిన్ వంశ కాలంలో చైనా

దేశపటము 6. ప్రాచీనకాలంలో చైనా

ప్రాచీన చైనీయులు ఎవరో నిర్ధారణగా చెప్పడం కష్టము. ఈవిషయంపై ముఖ్యంగా మూడు అభిప్రాయాలు ఉన్నాయి. మొదటిది—అనాదినుంచీ చైనీయులు హ్వాంగ్ హో, వే నదీలోయలలో నివసిస్తూ ఉండేవారని; దీని ప్రకారము చైనీయుల ప్రాచీనులు విదేశాలనుంచి చైనాలోనికి రాలేదని. రెండో అభిప్రాయము—చైనీయుల ప్రాచీనులు బర్మా ప్రాంతంనుంచి వచ్చినారని. మూడో అభిప్రాయము ప్రాచీన చైనీయులు మధ్య ఆసియానుంచి వచ్చిన వారని—వారు, సుమేరియన్‌లు ఒకే తెగకు చెందినవారని. కాని క్రీ. వె. 1926, 1930 మధ్య పూర్వ ప్రాచీన శిలాయుగానికి చెందిన మానవుని ఎముకలు పెకింగ్‌లో దొరికినందున, ఈ పెకింగ్ మానవునికీ ప్రాచీన చైనీయులకూ సంబంధాన్ని చరిత్రకారులు ఇంకా నిర్ణయించ వలసిఉన్నది. పెకింగ్ మానవుని ఎముకలు దొరకడం మూలాన చైనా చరిత్ర పూర్వ, ప్రాచీన శిలాయుగంనుంచే ప్రారంభమైనదని చెప్పవచ్చు. హ్వాంగ్ హో లోయలోని యాంగ్ షౌ గ్రామంలో జరిగిన పురావస్తుతవ్వకాల వల్ల చైనాలో నవీన శిలాయుగం గురించిన ఆధారాలు విశేషంగా లభించినాయి. 'చైనాదేశం చరిత్రకారులకు స్వర్గలోకంవంటిది' ('The paradise of historians')అని అంటున్నారు. ఇందుకు కారణము ఆ దేశచరిత్ర రచనకు కావలసిన ఆధారాలు పుష్కలంగా ఉండడం, అనాదినుంచీ చరిత్రకారులు చైనా చరిత్రను వ్రాయడం. కాని వారు వ్రాసిన చరిత్ర అంతా సత్యం కాక కట్టుకథలు అధికంగా కలిసింది అవడం వల్ల మనము వారి రచనలను జాగ్రత్తగా పరిశీలించి, గ్రహించవలసిఉన్నది.

## రాజకీయ పరిస్థితులు

చైనాదేశాన్ని పరిపాలించిన ప్రథమ ముఖ్య రాజవంశము షాంగ్ (Shang) వంశము. ఈ వంశ పరిపాలనా కాలము సుమారు క్రీ. పూ. 1450 నుంచి క్రీ. పూ. 1050 వరకు. అప్పటికే చైనాలో నాగరకత బాగా అభివృద్ధి చెందింది. రాచరికము, మతము, చీనా దేశీయ మృత్తిక (Porcelain), పట్టు పరిశ్రమలు చైనాలో వృద్ధిని

పొందినాయి. దేశంలో జరిగిన తిరుగుబాట్లు మూలంగా క్రీ. పూ. 1050 లో షాంగ్ వంశము అంతరించి, చౌ (Chow) వంశం అధికారానికి వచ్చింది. ఈ వంశము సుమారు క్రీ. పూ. 1050 నుంచి క్రీ. పూ. 256 వరకు దాదాపు 800 సంవత్సరాలు చైనాను పరిపాలించింది. ఈ కాలంలో అధికారులైన భూస్వాముల మండలాలు పర్పడి దేశంలో రాజకీయ అనైక్యము ప్రబలింది. కాని ఈ కల్లోల యుగంలోనే చైనా భాష, సారస్వతము, కళలు, దర్శనము వృద్ధి చెంది, చీనా సంస్కృతి వికసించింది. చైనాలోని అతి ప్రధాన దార్శనికులైన లౌత్స (Lao - tse), కన్ఫూషియస్ (Confucius) ఈ కాలంలో ఉద్భవించినవారే.

చౌ వంశ పరిపాలన ఆఖరిదశకు 'కలహాయుగము' (period of 'Contending States') అని పేరు. ఈ దశలో చైనా వేయికిపైన చిన్న రాజ్యాలుగా చీలి, వాటి మధ్య స్పర్థలు, వైషమ్యాలు ప్రబలినాయి. క్రీ. పూ. 3 వ శతాబ్దంనాటికి పరస్పర యుద్ధాల ఫలితంగా 14 రాజ్యాలైనాయి. ఈ పరిస్థితులతో చైనా వాయవ్యదిశలో ఉన్న చిన్ (Ch'in) రాజ్యం (క్రీ. పూ. 256 నుంచి క్రీ. పూ. 207 వరకు తక్కిన రాజ్యాలతో చైనా ఆధిపత్యంకోసం పోరాడి విజయం పొందింది. చిన్ రాజులలో కడపటివాడైన షి హ్వాంగ్ దీ (Shih Huang Ti) క్రీ. పూ. 221 నుంచీ క్రీ. పూ. 207 వరకూ చైనాను చక్రవర్తిగా పలినాడు. ఇతని మంత్రి లీ సు (Li Ssu) అతి మేధాశాలిగా ఉండేవాడు. వీరి కాలంలో చైనాలో బలమైన కేంద్ర పరిపాలన పర్పడింది. దేశంలోని ప్రభుత్వాధికారులందరూ చివరకు కేంద్ర పరిపాలనా పర్యవేక్షణకింద ఉండేటట్లు పర్పాటు అయింది. దేశానికంతా ఒకే తులామానాలు, పన్నుల విధానము ప్రవేశపెట్టినారు. కాని, ఇంతకుముందున్న చైనా అనైక్యత చరిత్రను ప్రజలు మరచిపోవడానికి షి హ్వాంగ్ దీ నాటి చరిత్రను, ఆ చరిత్రను సమర్థించిన దార్శనిక సాహిత్యాన్ని రూపుమాపడానికి ప్రయత్నించింది. అనేక అమూల్య గ్రంథాలు తగులబెట్టినారు. చైనాపై ఇతరులు దండెత్తిరాకుండా నిరోధింపగల పెద్దగోడ (Great Wall of China)ను

కట్టించింది ఇతడే. ఇతడు తన వంశం పేరైన చిన్ శబ్దాన్నే దేశం పేరుగా వాడుకలోకి తెచ్చినాడు. అందుచేతనే చీనా దేశమనే పేరు వచ్చింది.

## దార్శనికుల యుగము (The Age of the Philosophers)

ప్రాచీన చైనా చరిత్రను దార్శనికుల యుగము అంటారు. ఇందుకు కారణం చైనా సాంస్కృతిక వికాసంలో ప్రత్యేకంగా పేర్కొనవలసింది దార్శనిక వికాసము. ఇది ముఖ్యంగా చౌ వంశ కాలంలో జరిగింది. చైనా దార్శనికులలో అతి ప్రధాన దార్శనికులు లౌత్స (Lao tse), కన్ఫ్యూషియస్ (Confucius).

## లౌత్స (Lao-Tse)

లౌత్సనుగురించి చరిత్రకారులు అనేక సందేహాలను వెలిబుచ్చుతున్నారు. కొందరు లౌత్స అనే దార్శనికుడు చీనా చరిత్రలోనే లేడు అంటున్నారు. సంప్రదాయము, కొందరు చరిత్రకారుల అభిప్రాయాలను అనుసరించి లౌత్స జీవిత విశేషాలను కొన్నిటిని పేర్కొనవచ్చు. లౌత్స అనే పదానికి అర్థము 'పురాతన దార్శనికుడు' అని. లౌత్స అసలు పేరు లె. చీనా చరిత్రకారుడు సూమా చీయన్ (Szuma Ch'ien) లౌత్స చౌ రాజ గ్రంథాలయ అధికారిగా ఉండేవాడనీ, నాటి రాజకీయాలలోని ధూర్తతను ఏవగించుకొని దేశాన్ని వదలిపెట్టిపోయినాడనీ, దేశాన్ని వదలేముందు దౌ–దే–జింగ్ (Tao-Te-Ching) అనే గ్రంథాన్ని వ్రాసినాడనీ అభిప్రాయపడుతున్నాడు. లౌత్స 87 సంవత్సరాలు జీవించినట్లు సాంప్రదాయం చెబుతున్నది. ఈతడు ప్రచారంచేసిన దర్శనాన్ని 'దౌ' (Tao) అంటున్నారు.

'దౌ' అంటే ఏమిటో నిర్దేశించడం కష్టము. 'దౌ' అనే పదానికి అర్థము 'రస్తా' అని. కాని దార్శనికంగా మార్గము అనే భావంలో ఉపయోగించబడింది. లౌత్స ప్రకారం దౌ సహజత్వాన్నీ, స్వార్థ ప్రయోజనరహితమైన నిష్కామకర్మనూ సూచిస్తుంది.

పాండిత్యం, ఆలోచన, ధీశక్తి వల్ల మేలుకన్నా కీడే ఎక్కువ జరుగుతుంది. ప్రపంచంలో పాండిత్యం పెరిగినకొద్దీ ధూర్తులుకూడా ఎక్కువ అయినారు. ఎందుకంటే పాండిత్యంవల్ల మానవుడు వివేకి కాడు. లౌత్స బోధనప్రకారం మానవుడు నిష్కల్మషమైన, అసంకీర్ణమైన ఋజుమార్గాన్ని అనుసరిస్తే జీవితము ఆనందదాయకం అవుతుంది. ధీశక్తి, విజ్ఞానం అనే పేరుతో మానవుడు సృష్టించిన నాగరకతా సాధనాలు ఈ ఆనందానికి ఆటంకాలు. లౌత్స అభిమాన ధర్మాలు — దయ, నిరాడంబరత, నిరహంకారము. ప్రపంచంలో శాంతి, ఆనందము ఏర్పడాలంటే దో మార్గమే శరణ్యము. ఈశ్వరుడు కూడా ఉద్భవించింది, అనుసరించేది దో మార్గమే అని లౌత్స చెప్పేవాడు.

## కన్ఫూషియస్ (Confucius)

ప్రపంచచరిత్రలోనే అతి శ్రేష్ఠుడు అనదగిన దార్శనికుడు కన్ఫూషియస్. కన్ఫూషియస్ అనే పేరు కుంగ్–ఫూడ్జ (K'ung-fu-tze) అనే దాని యూరోపియన్ రూపం. దీనికి కుంగ్ గురువు అని అర్థము. ఇతని శిష్యులు ఇతనిని కూంగ్ చీ వూ, (K'ung Ch'iu) అని పిలిచేవారు. కన్ఫూషియస్ 'లూ' (Lu) రాజ్యంలో 'చూ ఫూ' (Ch'ufu) అనే చోట క్రీ. పూ. 551 లో జన్మించినాడు. తన మూడో ఏటే తండ్రిని కోల్పోయినాడు. అందువల్ల తల్లిని తనే పోషించవలసివచ్చి, బాల్యంనుంచే శ్రమించి పనిచేయవలసివచ్చింది. కన్ఫూషియస్ తన 18 వ ఏట పెండ్లాడి, 4 సంవత్సరాల తర్వాత విడాకులు ఇచ్చినాడు. మరల వివాహమాడలేదు. యువకుడుగా ఉన్నప్పుడు కన్ఫూషియస్ ధనుర్విద్యలోను, సంగీతంలోను ప్రావీణ్యము సంపాదించినాడు. ఇతడు తన 22 వ ఏట ఉపాధ్యాయ వృత్తిని అవలంబించి శిష్యులకు చరిత్రనూ, కవిత్వాన్నీ, మర్యాదను గురించిన అంశాలను బోధించినాడు. అతని నమ్రత, విశాలభావాల మూలంగా వేలకొద్దీ శిష్యులు అతనిని అనుసరించినారు. 'లూ' రాష్ట్రంలో కొంతకాలము ఉద్యోగిగా ఉండి, తరవాత రాష్ట్రాంతర భ్రమణాది ఎన్నో అనుభవాలకు గురియై, క్రీ. పూ. 501 లో 'లూ' ప్రధాన

మంత్రియై సమర్థతతో రాష్ట్రపాలన చేసినాడు. క్రీ. పూ. 497 ప్రాంతంలో రాజు దుర్వర్తనకు లోనుకాగా ఇతడు తన పదవినీ, రాష్ట్రాన్నీ వదలి, శిష్యులతో కలసి చైనాలోని ఇతర రాష్ట్రాలలో పర్యటించి, నీతులను బోధించినాడు, 'లూ' రాజైన 'గే' (Gae) ఆహ్వానంమీద తిరిగి తన రాష్ట్రానికి తిరిగివచ్చి జీవితంలో చివరి మూడేండ్లు అధ్యయన, అధ్యాపనాలతో గడిపినాడు. కన్ఫ్యూషియస్ క్రీ. పూ. 479 లో తన 72 వ ఏట మరణించినాడు.

కన్ఫ్యూషియస్ సొంతంగా వ్రాసినవిగాని, సంకలనము చేసినవి గాని 'పంచ జింగ్' (Five-Ching) అనే ఐదు గ్రంథాలని వాడుక. 'లీ చీ' (Li-Chi) అనే గ్రంథము ప్రాచీన శాస్త్ర విధులకు సంబంధించింది. 'ఈ జింగ్' (I-Ching) ఆత్మతత్త్వ విద్యకు సంబంధించింది. 'షి జింగ్' (Shi-Ching) అనే గ్రంథము మానవుని నైతిక విలువలను వివరిస్తుంది. 'చూన్ చ్యూ' (Chun Ch'iu) లో తన రాష్ట్రమైన 'లూ' చరిత్రను కన్ఫ్యూషియస్ వివరించినాడు. 'షూజింగ్' గ్రంథంలో చైనా ప్రాచీన చరిత్రను, నాటి చక్రవర్తులను గురించి అతడు వ్రాసినాడు. చైనీయులు వారి తొమ్మిది అతి ముఖ్య ప్రాచీన గ్రంథాలలో ఈ ఐదు గ్రంథాలను లెక్కిస్తున్నారు.

కన్ఫ్యూషియస్ స్వచ్ఛమైనటువంటి, స్పష్టమైనటువంటి మనోభావాలకు ప్రాధాన్య మిచ్చేవాడు. ఒక విషయము అర్థమైనప్పుడు ఆ విషయము తెలుసునని వక్కాణించడం, ఆ విషయము అర్థం కానప్పుడు తెలియదని ఒప్పుకోవడం విజ్ఞానమని అతడు బోధించినాడు. దర్శనశాస్త్రము ఆచరణయోగ్యంగా ఉండాలనే అభిప్రాయంతో శుష్కవేదాంత తర్కాలకు అతడు తనప్రచారంలో చోటు ఇవ్వలేదు. అతడు దేశ సంక్షోభానికి నైతిక పతనం కారణంగా భావించి దేశం పునరుద్ధరణకు కుటుంబ వ్యవస్థను చక్కని నైతిక స్థాయిలో ఉంచాలని అభిప్రాయపడినాడు. ఇందుకు ప్రతివ్యక్తీ స్వచ్ఛమైన భావాలతో పరిశుద్ధ జీవనాన్ని గడపాలని అతడు బోధించినాడు. ప్రతివ్యక్తీ తన వైయక్తిక విధ్యుక్త ధర్మాలను నెరవేరిస్తే రాజ్య వ్యవస్థ దానికదే చక్కబడుతుందని అతడు చెప్పినాడు.